సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు
మంగళవారం, 21, మే, 2024



సోమశిలలో 7.691 టీఎంసీలు

సోమశిల: జలాశయంలో సోమవారం సాయంత్రానికి 7.691 టీఎంసీలు ఉన్నాయి. పెన్నార్‌డెల్టాకు 200, ఉత్తరకాలువకు 5, దక్షిణ కాలువకు 5 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రాములు)	రూ.77,130
22 క్యారెట్లు ఆర్నమెంట్ (1గ్రా)	రూ.6,908
3 శాతం జీఎస్టీతో	రూ.7,115
నవర (8 గ్రాములు)	రూ.56,920



కొనసాగుతున్న కార్డన్ సెర్చ్

జిల్లాలో పోలీసులు పట్టణ శివారు ప్రాంతాలతో పాటు అనుమానాస్పద ప్రదేశాలను అణువణువు తనిఖీ చేస్తున్నారు. నేరాల నియంత్రణలో భాగంగా రెండో రోజూ కొనసాగించారు. 8లో

న్యూస్‌రీల్

హనుమంత వాహనంపై వేదగిరీశుడు



నెల్లూరు సిటీ: నరసింహకొండపై కొలువైన వేదగిరి లక్ష్మీనరసింహస్వామి సోమవారం హనుమంత వాహనంపై భక్తులకు అభయప్రదాతగా దర్శనమిచ్చారు. ఆలయంలో బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఉదయం చప్పర ఉత్సవం గిరి ప్రదక్షిణగా సాగింది. ప్రధాన అర్చకులు భాస్కరాచార్యులు ఆధ్వర్యంలో వేద పండితుల మంత్రోచ్ఛారణల మధ్య వైభవంగా జరిగాయి. కార్యనిర్వహణాధికారి వి.గిరికృష్ణ, అర్చక సిబ్బంది, దేవస్థాన సిబ్బంది బ్రహ్మోత్సవ కార్యక్రమాలను పర్యవేక్షించారు. విఘ్నేశ్వర నృత్య నికేతన్ నృత్య ప్రదర్శన, గుర్రం జాషువా కళానిలయం సత్య హరిశ్చంద్ర అడవి శీను, చెన్నకేశవ నాట్య మండలి సత్య హరిశ్చంద్ర కాటి సీను, దుర్గా నాట్యమండలి కృష్ణార్జున యుద్ధంలోని యుద్ధ ఘట్టం భక్తులను అలరించాయి.

డీసీపల్లిలో 674 పొగాకు బేళ్ల విక్రయం

మర్రిపాడు: మండలంలోని డీసీపల్లి పొగాకు బోర్డు వేలం కేంద్రంలో సోమవారం 674 పొగాకు బేళ్లను విక్రయించినట్లు వేలం నిర్వహణాధికారి రాజశేఖర్ తెలిపారు. వేలానికి 740 బేళ్లు రాగా 674 బేళ్లను విక్రయించామన్నారు. మిగిలిన బేళ్లను వివిధ కారణాలతో తిరస్కరించినట్లు తెలిపారు. వేలంలో 85,386 కిలోల పొగాకును విక్రయించగా రూ.2,34,33,096 వ్యాపారం జరిగింది. కిలోకు గరిష్ఠంగా రూ.309, కనిష్ఠంగా రూ.205 ధర లభించింది. సగటు ధర రూ.274.44 నమోదైంది. వేలంలో 18 కంపెనీల వ్యాపార ప్రతినిధులు పాల్గొన్నారు.

స్ట్రాంగ్‌రూములను పరిశీలించిన కలెక్టర్, ఎస్పీ



నెల్లూరు(దర్గామిట్ట): కనుపర్తిపాడులోని ప్రియదర్శిని కళాశాలలో ఈవీఎంలను భద్రపరిచిన స్ట్రాంగ్‌రూములను కలెక్టర్ ఎం హరినారాయణన్, ఎస్పీ ఆరిఫ్‌హఫీజ్ సోమవారం పరిశీలించారు. ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు కౌంటింగ్ పూర్తయ్యే వరకు ప్రతిరోజూ ఈవీఎంలు భద్రపరిచిన స్ట్రాంగ్‌రూములను కలెక్టర్, ఎస్పీ పరిశీలించాలి. ఈ మేరకు వారు స్ట్రాంగ్‌రూములతో పాటు సీసీ టీవీల మానిటరింగ్ కంట్రోల్ రూమును పరిశీలించారు.

24న విశ్రాంత ఉద్యోగుల సమావేశం

నెల్లూరు(అర్బన్): రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘ జిల్లా సర్వసభ్య సమావేశాన్ని ఈ నెల 24న సాయంత్రం 5 గంటలకు పురమందిర ప్రాంగణంలోని వర్ధమాన సమాజం హాల్‌లో నిర్వహించనున్నట్లు ఆ సంఘ అధ్యక్ష, కార్యదర్శులు లక్ష్మీనారాయణ, వెంకయ్య సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. విశ్రాంత ఉద్యోగుల పెండింగ్ సమస్యలపై చర్చించనున్నట్లు చెప్పారు. సంఘ సభ్యులు హాజరుకావాలని కోరారు.

ఖరీఫ్ ఆశల మోసులు

సోమశిల, కండలేరుల్లో 14.417 టీఎంసీలు

- ఏటా ఖరీఫ్‌లో 1.25 లక్షల ఎకరాల్లో సాగు
- బోర్లు, బావులు కింద మరో 80 వేల ఎకరాలు
- ఈ ఏడాది తుఫాన్‌పైనే ఖరీఫ్ ఆశలు
- సేద్యానికి సిద్ధమవుతున్న రైతులు

జిల్లాలోని సాగునీటి జలాశయాల్లో నీటి వనరులు అడుగంటిన నేపథ్యంలో ఖరీఫ్‌పై రైతులు ఆశలు వదులుకున్నారు. కేవలం బోర్లు, బావుల కింద మాత్రమే సాగు జరుగుతోంది. అయితే బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ద్రోణి బలపడిన నేపథ్యంలో మరో రెండు రోజుల్లో వాయుగుండంగా, ఆ తర్వాత తుఫాన్‌గా మరే అవకాశం ఉందని వాతావరణ శాఖ ప్రకటించింది. ప్రధానంగా రాయలసీమ జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉండడంతో జిల్లా రైతాంగంలో ఖరీఫ్ ఆశలు మోసులెత్తుతున్నాయి. దీంతో పాటు నైరుతి రుతుపవనాలు చురుగ్గా కదులుతున్న నేపథ్యంలో వరుణుడి కరుణతో జిల్లాలో వర్షాలు కురుస్తున్నాయి. దీంతో రైతాంగం ముమ్మరంగా వ్యవసాయ పనుల్లో నిమగ్నమైంది. ఇప్పటికే భూగర్భ జలాలు అందుబాటులో ఉన్న ప్రాంతాల్లో బోర్ల కింద ఆరుతడి పంటల సాగు మొదలైంది.



సాక్షి ప్రతినిధి, నెల్లూరు: వ్యవసాయానికి జిల్లా ప్రసిద్ధి. ప్రధానంగా అత్యధికంగా వరి, ఆ తర్వాత వేరుశనగ, మినుము, పెసర, నువ్వు తదితర పంటలు సాగు జరుగుతోంది. ఖరీఫ్‌లో జలాశయం, బోర్లు, బావుల ఆధారంగా దాదాపు 2 లక్షల ఎకరాలకు పైగా జరుగుతుంటే.. రబీలో 6 లక్షల ఎకరాలకుపైగా సాగు జరుగుతోంది. టీడీపీ హయాంలో ఈ సాగు విస్తీర్ణం సగానికి పడిపోయింది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పాటైనప్పటి నుంచి జిల్లాలో ఖరీఫ్, రబీ సీజన్లలో పంటలు పుష్కలంగా పండుతున్నాయి. గత సంవత్సరం వరకు సీజన్ల వారీగా వర్షాలు కురవడంతో జిల్లాలోని ప్రధాన జలాశయాలు అయిన సోమశిల, కండలేరుతో పాటు చెరువులు, చిన్న పాటి రిజర్వాయర్లు సైతం జలకళను సంతరించుకుంటున్నాయి. దీంతో జిల్లా అంతటా భూగర్భ జలాలు బాగున్నాయి. అయితే గతేడాది ఆశించిన స్థాయిలో వర్షాలు కురకపోవడంతో ప్రధాన జలాశయాల్లో సాగు నీరు కొంత మేరకే అందుబాటులో ఉండింది. దీంతో రబీ సీజన్‌లో ప్రతి ఎకరాకు సాగునీరు అందించి పంట పండించారు. రైతు బాంధవుడిగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రైతులను ఆదుకునేందుకు అన్ని విధాలా చేయూతనందిస్తున్నారు. గ్రామాల్లోనే గ్రామ సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు (ఆర్‌బీకే) ఏర్పాటు చేసి మండల, రెవెన్యూ డివిజన్ కేంద్రాలకు రైతులు వెళ్లాల్సిన అవసరం లేకుండా అన్నీ గ్రామ సీమల్లోనే రైతులకు అందుబాటులోకి తీసుకొచ్చారు. పంటల సాగుకు దుక్కి దున్నే సమయం నుంచి పండించిన పంటలను గిట్టుబాటు ధరలకు కొనుగోలు చేపట్టే వరకు అన్నీ ప్రభుత్వమే దగ్గరుండి రైతులను అండగా నిలుస్తోంది. 2019లో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పాటైన నాటి నుంచి ప్రతి సంవత్సరం ఖరీఫ్, రబీ సీజన్లలో రైతులకు ఎలాంటి అవసరాలైనా ఇబ్బందులు లేకుండా రైతుకు వెన్నుదన్నుగా సీఎం వైఎస్ జగన్ ఉంటున్నారు. ఈ సంవత్సరం ఖరీఫ్ సీజన్‌కు ముందుగానే ఎరువులను రైతులకు అందుబాటులో ఉంచారు. వర్షాలు కురిసి సాగునీరు అందుబాటులోకి వస్తే మరికొంత సాగు విస్తీర్ణం పెరిగే అవకాశం ఉందని, అందుకు తగిన విధంగా ఎరువులను సిద్ధం చేయనున్నారు. అయితే ఈ ఏడాది ఖరీఫ్ సమయానికి సోమశిలలో 7.691 టీఎంసీలు, కండలేరులో 6.726 టీఎంసీలు మాత్రమే నీరు అందుబాటులో ఉండడంతో సాగు నీటి కేటాయింపులు చేయలేని పరిస్థితి.

తుఫాన్‌పై ఆశలు

జిల్లా రైతాంగంలో తుఫాన్ ఆశలు ఖరీఫ్ మోసులెత్తింది. దీనికి తోడు ఈ ఏడాది నైరుతి రుతుపవనాలు ముందుగానే రాష్ట్రంలో విస్తరించనున్నాయని వాతావరణ శాఖ చల్లని కబురు చెప్పడంతో రైతులు సంతోషంలో మునిగిపోయారు. తాజాగా ఇటీవల బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ద్రోణి బలపడింది. మరో రెండు రోజుల్లో వాయుగుండంగా మారి తుఫాన్ మారుతుందని వాతావరణ శాఖ చెప్పింది. తుఫాన్ ప్రభావంగా రాయలసీమ జిల్లాలకు భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశాలు ఉన్నాయి. ఇటు తుఫాన్, అటు నైరుతి రుతుపవనాలు ప్రభావంగా విస్తారంగా వర్షాలు కురిస్తే సోమశిల, కండలేరుకు సాగు నీరు చేరుతుందని రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఈ ఖరీఫ్‌పై రైతులు ఆశలు పెట్టుకుంటున్నారు. ఐదేళ్లుగా కూడా ఖరీఫ్ సాగు విస్తారంగానే ఉంది. జిల్లా వ్యాప్తంగా సాధారణంగా జలాశయాల్లో నీరు అందుబాటులో ఉంటే 1.25 లక్షల ఎకరాలు, బోర్లు, బావుల కింద సుమారు మరో 80 వేల ఎకరాల్లో సాగు జరిగేది. కానీ ఈ ఏడాది కేవలం బోర్లు, బావుల కింద మాత్రమే సాగు చేస్తున్నారు.

తాగునీటికి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు

- మున్సిపాలిటీలు, పంచాయతీల్లో అప్రమత్తంగా వ్యవహరించాలి
- నీటి పరీక్షలు నిర్వహించి శుద్ధి నీటిని సరఫరా చేయండి
- ఇంజినీరింగ్ అధికారులకు కలెక్టర్ హరినారాయణన్ ఆదేశం



మాట్లాడుతున్న కలెక్టర్ ఎం.హరినారాయణన్

నెల్లూరు(దర్గామిట్ట): వేసవి తీవ్రత దృష్ట్యా జిల్లాలో ఎక్కడా తాగునీటికి ఇబ్బందులు తలెత్తకుండా ప్రత్యేక కార్యాచరణతో పని చేయాలని కలెక్టర్ ఎం.హరినారాయణన్ సంబంధిత ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టర్ తన క్యాంపు కార్యాలయంలో పట్టణాలు, గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి సరఫరాపై చేపట్టాల్సిన చర్యలపై వివిధ విభాగాల ఇంజినీరింగ్ అధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని అన్ని మున్సిపాలిటీలు, గ్రామ పంచాయతీల్లో తాగునీటికి ఇబ్బందులు లేకుండా అప్రమత్తంగా ఉంటూ అవసరమైన అన్ని చర్యలు చేపట్టాలన్నారు. నెల్లూరు, కందుకూరు, కావలి, ఆత్మకూరు మున్సిపాలిటీల్లో సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్‌ల్లో ఎప్పటికప్పుడు నీటి నిల్వలను పరిశీలిస్తూ ప్రజలకు తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా నీటిని నిల్వ చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్లు, ఇంజినీర్లకు సూచించారు. నీటి నాణ్యతను కూడా పరీక్షించి పరిశుభ్రమైన నీటిని సరఫరా చేయాలన్నారు. తాగునీటి సమస్యలపై వచ్చే ఫిర్యాదులు ఎప్పటికప్పుడు పరిష్కరించాలని, ఫిర్యాదులు వచ్చిన వెంటనే సమస్య తెలిపిన వారికి ఫోన్ చేసి వారి అభిప్రాయం తీసుకోవాలని ఇంజినీరింగ్ అధికారులకు సూచించారు. సమస్య పరిష్కారం అయిన వెంటనే గ్రామ పంచాయతీ కార్యదర్శి, సర్పంచ్, ఇంజినీరింగ్ అసిస్టెంట్ ఫిర్యాదుదారుతో ఒక ఫొటో తీసుకుని ఉమ్మడి నివేదికను అందించాలని ఆదేశించారు. అవసరమైన చోట ట్యాంకర్లతో తాగునీటిని సరఫరా చేయాలన్నారు. ఈ ట్యాంకర్లను కూడా శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. గ్రామాల్లో పనిచేయని బోర్లను గుర్తించి మరమ్మతులు చేయించాలని ఆదేశించారు. సోమశిల, కండలేరు జలాశయాల్లో ఉన్న నీటి నిల్వల్లో జిల్లా ప్రజలకు తాగునీటి అవసరాలకు సరిపడా నీటి నిల్వలు ఉంచుకోవాలని, అందుకనుగుణంగా ప్రత్యేక కార్యాచరణ రూపొందించుకోవాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. వేసవి తీవ్రత దృష్ట్యా పబ్లిక్ హెల్త్, ఆర్‌డబ్ల్యూఎస్, ఇరిగేషన్, పంచాయతీ శాఖల ఇంజినీరింగ్ అధికారులు సమన్వయంతో పనిచేసి తాగునీటికి ఇబ్బందులు లేకుండా అన్ని ముందస్తు చర్యలు సకాలంలో చేపట్టాలని సూచించారు. ఈ సమీక్ష సమావేశంలో నెల్లూరు మున్సిపల్ కమిషనర్ వికాస్ మర్మత్, జెడ్పీ సీఈఓ కన్నమనాయుడు, జిల్లా పంచాయతీ అధికారి సుస్మిత, డ్వామా పీడీ వెంకట్రావు, ఇరిగేషన్, తెలుగుగంగ ప్రాజెక్ట్, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్‌ఈలు కృష్ణమోహన్, రమణారెడ్డి, ఎస్‌కే మర్దన్ అలి, పబ్లిక్ హెల్త్ ఈఈ సంజయ్, పలువురు ఇంజినీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

రేపటి నుంచి నరసింహస్వామి జయంతి ఉత్సవాలు



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

కందుకూరు: పట్టణంలో జనార్దనస్వామి ఆలయంలో కొలువైన నరసింహస్వామి జయంతి ఉత్సవాలు ఈ నెల 22, 23వ తేదీల్లో ఇస్కాన్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించనున్నట్లు రాఘవదాస్ ప్రభుజీ తెలిపారు. సోమవారం స్థానిక జనార్దనస్వామి ఆలయంలో ఉత్సవాల కరపత్రాలను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ శ్రీల భక్త సిద్ధాంత సరస్వతి గోస్వామి ప్రభుపాదుల 150వ జయంతి వార్షికోత్సవం సందర్భంగా కందుకూరులోని నరసింహస్వామి జయంతి ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వేడుకల్లో భాగంగా ఈ నెల 22వ తేదీ స్వామి వారికి అభిషేకం, నైవేద్యం వేడుకగా జరుగుతుంది. సాయంత్రం వాసవి కన్యకా పరమేశ్వరి కల్యాణ మండపంలో స్వామి వారికి సుగంధ తైలాభిషేకం, పంచామృతాభిషేకం, ఫలాభిషేకం, పుష్పాభిషేకం వేడుకలు జరుగుతాయి. 23వ తేదీ నరసింహస్వామి శోభయాత్ర, నగర సంకీర్తన పెద్దబజార్ నుంచి జనార్దనస్వామి దేవస్థానం వరకు సాగుతుంది. అనంతరం నరసింహ హోమం, సుదర్శన హోమం ఇస్కాన్ వేద పండితులతో నిర్వహిస్తారన్నారు. ఈ వేడుకల్లో పాల్గొనాలనుకుంటే ఉభయ దాతలు 94902 97310, 98480 14229, 81558 78344 నంబర్లను సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు అనంతస్వామి, వినాయకస్వామి ఆలయ ప్రెసిడెంట్ బొగ్గవరపు సత్యనారాయణ, వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆలయ ప్రెసిడెంట్ కొత్త వెంకటేశ్వర్లు, ఆల్ ఇండియా వాసవి సత్ర సముదాయాల మీడియా చైర్మన్ చక్కా వెంకట కేశవరావు, టీటీడీ మల్లయ్య, రవి, విప్పగుంట శ్రీనిధి తదితరులు పాల్గొన్నారు.

అట్టహాసంగా వీఎస్‌యూ స్నాతకోత్సవాలు

- 20 మందికి బంగారు పతకాలు బహూకరణ
- 21 మందికి పరిశోధన డాక్టరేట్లు ప్రదానం
- వేడుకలకు రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ హాజరు
- వీఎస్‌యూ వైస్ చాన్సలర్ జీఎం సుందరవల్లి



మాట్లాడుతున్న వీఎస్‌యూ వైస్ చాన్సలర్ జీఎం సుందరవల్లి

వెంకటాచలం: విక్రమసింహపురి యూనివర్సిటీ (వీఎస్‌యూ) 8వ, 9వ స్నాతకోత్సవాలు ఈ నెల 22న అట్టహాసంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు వీఎస్‌యూ వైస్ చాన్సలర్ జీఎం సుందరవల్లి చెప్పారు. మండలంలోని కాకుటూరులో ఉన్న వీఎస్‌యూలో సోమవారం వైస్ చాన్సలర్ జీఎం సుందరవల్లి విలేకర్ల సమావేశం నిర్వహించారు. గతేడాది వీఎస్‌యూ సిబ్బంది మొత్తం వీఎస్‌యూకు న్యాక్ గ్రేడ్ విధుల్లో ఉండడంతో స్నాతకోత్సవం నిర్వహించలేదన్నారు. అయితే 8వ, 9వ స్నాతకోత్సవాలు బుధవారం రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ అధ్యక్షతన ప్రతిష్టాత్మకంగా నిర్వహించేందుకు అన్నీ ఏర్పాట్లు చేశామన్నారు. ఉదయం 9.30 గంటలకు ఈ స్నాతకోత్సవాలు ప్రారంభమవుతాయన్నారు. ఏరోనాటికల్ సొసైటీ ఆఫ్ ఇండియా ప్రెసిడెంట్, ప్రముఖ శాస్త్రవేత్త డాక్టర్ జి.సతీష్ రెడ్డి స్నాతకోపన్యాసం చేస్తారని తెలిపారు. హైదరాబాద్ అపోలో హాస్పిటల్‌లో వైద్య సేవలందించే ప్రముఖ ఈఎన్‌టీ డాక్టర్ ఈసీ వినయ్‌కుమార్‌కు గౌరవ డాక్టరేట్, 20 మందికి బంగారు పతకాలు, 21 మందికి డాక్టరేట్ ప్రదానం మొత్తంగా 8వ, 9వ స్నాతకోత్సవానికి సంబంధించి 3,636 మంది విద్యార్థులు తమ ఒరిజనల్ డిగ్రీ పట్టాలను అందుకోనున్నారని తెలియజేశారు. ఈ సమావేశంలో రిజిస్ట్రార్ డాక్టర్ పి.రామచంద్రారెడ్డి, ప్రిన్సిపల్ సీహెచ్ విజయ, పరీక్షల నిర్వహణాధికారిణి డాక్టర్ ఆర్.మధుమతి తదితరులు పాల్గొన్నారు.

గవర్నర్ పర్యటనకు పటిష్ట ఏర్పాట్లు

- కలెక్టర్ ఎం.హరినారాయణన్



గవర్నర్ పర్యటన ఏర్పాట్లపై వైస్ చాన్సలర్ జీఎం సుందరవల్లితో చర్చిస్తున్న కలెక్టర్, ఎస్పీ తదితరులు

వెంకటాచలం: రాష్ట్ర గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్ జిల్లా పర్యటనకు ఎటువంటి లోటుపాట్లు లేకుండా ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ ఎం.హరినారాయణన్ అధికారులను ఆదేశించారు. ఈ నెల 22న వీఎస్‌యూలో జరగనున్న స్నాతకోత్సవాలకు గవర్నర్ విచ్చేయనున్న నేపథ్యంలో సోమవారం సాయంత్రం కలెక్టర్ ఎం.హరినారాయణన్ ఎస్పీ ఆరిఫ్ హఫీజ్, వైస్ చాన్సలర్ జీఎం సుందరవల్లి, రిజిస్ట్రార్ డాక్టర్ పి.రామచంద్రారెడ్డితో కలిసి సభా ప్రాంగణం వద్ద ఏర్పాట్లను పరిశీలించారు. స్నాతకోత్సవ వేడుకలకు హాజరుకానున్న అతిథులు, విద్యార్థుల సంఖ్య, చేపట్టిన ఏర్పాట్లను అడిగి తెలుసుకున్నారు. వర్షం వచ్చినా ఎటువంటి ఇబ్బందులు లేకుండా అన్నీ ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులకు కలెక్టర్ సూచించారు. అన్నీ శాఖల అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేసి గవర్నర్ పర్యటనను విజయవంతం చేయాలన్నారు. పోలీసు బందోబస్తు, వైద్య ఆరోగ్యశాఖ అధికారులు అంబులెన్సులు, వైద్య సిబ్బంది అందుబాటులో ఉండాలని, విద్యుత్ సరఫరాకు అటంకం లేకుండా విద్యుత్ శాఖ అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కలెక్టర్ వెంట జేసీ సేతు మాధవన్, డీఆర్‌ఏ పీడీ సాంబశివారెడ్డి, నెల్లూరు రూరల్ డీఎస్పీ వీరాంజనేయరెడ్డి, డీఎంహెచ్‌ఓ పెంచలయ్య, ఆర్‌అండ్‌బీ ఎస్‌ఈ అశోక్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర గవర్నర్ జిల్లా పర్యటనలో స్వల్ప మార్పు

నెల్లూరు(దర్గామిట్ట): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గవర్నర్ ఎస్ అబ్దుల్ నజీర్ ఈ నెల 21వ తేదీ సాయంత్రం 5.10 గంటలకు గుంటూరు నుంచి రైలులో బయలుదేరి 9.24 గంటలకు నెల్లూరు రైల్వేస్టేషన్‌కు చేరుకుంటారు. అనంతరం నగరంలోని ఒక హోటల్‌లో రాత్రి బస చేస్తారు. 22వ తేదీ ఉదయం 11.30 నుంచి మధ్యాహ్నం 12.55 గంటల వరకు విక్రమ సింహపురి యూనివర్సిటీ స్నాతకోత్సవ వేడుకల్లో గవర్నర్ పాల్గొంటారు. సాయంత్రం 6 గంటలకు నెల్లూరు నుంచి రైలులో బయలుదేరి 9.50 గంటలకు విజయవాడకు చేరుకుంటారు.

'ఆట' విడుపు

ఏడాదంతా పుస్తకాలతో కుస్తీ పట్టిన పిల్లలకు వేసవి సెలవులు ఆట విడుపు. ఉదయం లేచినప్పటి నుంచి రాత్రి నిద్రపోయే వరకు చదువుల కోసం ట్యూషన్లు, స్కూళ్లకు చిన్నారులు పరుగులు తీశారు. తల్లిదండ్రులు సైతం తమ తమ విధుల నిర్వహణలో బిజీబిజీగా గడిపారు. వేసవి సెలవులు రావడంతో రొటీన్ లైఫ్ నుంచి బయటపడేందుకు కొంత సమయాన్ని కేటాయిస్తున్నారు. పిల్లలను తీసుకుని మైదానాల బాట పడుతున్నారు.

స్విమ్మింగ్‌పూల్ ప్రాంగణం కళకళ

- వివిధ క్రీడల కోర్టుల్లో సందడి
- ఉదయం, సాయంత్రం వేళల్లో పలు క్రీడాంశాల్లో శిక్షణ



బ్యాడ్మింటన్ ఆడుతున్న చిన్నారులు



స్విమ్మింగ్‌లో శిక్షణ పొందుతున్న చిన్నారులు

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): పిల్లలకు పరీక్షలు అయిపోయాయి. పెద్దలకు ఎన్నికలు పూర్తయ్యాయి. దీంతో పిల్లలను వెంటబెట్టుకుని పెద్దలు మైదానాలకు పరుగులు తీస్తున్నారు. రాష్ట్ర క్రీడాప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో ఏటా జిల్లా వ్యాప్తంగా వేసవి క్రీడా శిక్షణా శిబిరాలను నిర్వహించడం ఆనవాయితీ. అయితే ఈ ఏడాది అధికారికంగా వేసవి క్రీడా శిక్షణా శిబిరాలు ప్రారంభం కాలేదు. అయినా క్రీడలపై ఆసక్తి గలిగిన చిన్నారులు నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి స్పోర్ట్స్ కాంప్లెక్స్‌కు వస్తున్నారు. ఉదయం, సాయంత్రం వేళల్లో ఉత్సాహంగా వివిధ క్రీడాంశాల్లో శిక్షణ పొందుతూ కనిపిస్తున్నారు. స్టేడియంలో పది క్రీడల్లో శిక్షణ ఇచ్చేందుకు నిష్ణాతులైన కోచ్‌లు ఉన్నారు. దీంతో ఆయా క్రీడలను నేర్చుకునేందుకు చిన్నారులు ఆసక్తి చూపుతున్నారు. గతంలో వేసవి క్రీడా శిక్షణా శిబిరాల్లో తర్ఫీదు పొందిన క్రీడాకారులతో పాటు కొత్తవారు హాజరవుతున్నారు. దీంతో స్టేడియంలోని ఫుట్‌బాల్, ఖోఖో, కబడ్డీ, బ్యాడ్మింటన్ కోర్టులతో పాటు స్విమ్మింగ్‌పూల్ ప్రాంగణం కళకళలాడుతోంది. ఉదయం 6 నుంచి 8 గంటల వరకు, సాయంత్రం 4.30 నుంచి 6.30 గంటల వరకు కోచ్‌లు క్రీడాంశాల్లో శిక్షణ ఇస్తున్నారు. పెద్దలు తమ పిల్లలను ఆయా క్రీడా మైదానాల్లో శిక్షణకు వదిలి వారు వాకింగ్, వ్యాయామాలు చేస్తున్నారు.

క్రీడ	కోచ్ పేరు	సెల్ నంబర్
ఫుట్‌బాల్	ఎం పాండురంగారావు	99595 88950
	కే సాయికిరణ్	95813 72472
అథ్లెటిక్స్	ఎస్‌కే జాసీమ్	98496 00456
	ఏ రజనీకాంత్	99661 92017
కబడ్డీ	కే కోటయ్య	96661 63095
హాకీ	ఎం చందు	97426 50809
వెయిట్ లిఫ్టింగ్	కే తులసి	90525 77318
ఖోఖో	కే సుకుమార్	93904 48732
స్విమ్మింగ్	డీ నాగరాజు	88019 16198
బ్యాడ్మింటన్	జీ వెంకటేష్	94944 92717



ఫుట్‌బాల్‌లో శిక్షణ పొందుతున్న యువకులు

ప్రణాళికాబద్ధంగా కోచింగ్



స్టేడియంలో కోచ్‌లు ప్రణాళికాబద్ధంగా శిక్షణ ఇస్తారు. పిల్లలు సురక్షితంగా ఆడడమే కాకుండా పద్ధతి ప్రకారం ఆయా ఆటలను నేర్చుకోవచ్చు. స్విమ్మింగ్, ఇండోర్‌లో బ్యాడ్మింటన్ శిక్షణకు మాత్రమే పిల్లలు నామమాత్రపు రుసుం చెల్లించాల్సి ఉంటుంది. మిగిలిన క్రీడలకు సంబంధించి ఉచితంగా శిక్షణ అందజేస్తున్నాం. దేహదారుఢ్యంతో పాటు మానసికోల్లాసాన్ని పెంపొందించేందుకు క్రీడలు ఎంతో దోహదపడుతాయి. ఆసక్తి కలిగిన వారు కోచ్‌లను సంప్రదించవచ్చు.

– ఆర్‌కే యతిరాజ్, డీఎస్‌డీఓ

బ్రహ్మోత్సవాలకు తరలిరండి


స్వామి, అమ్మవార్ల ఊరేగింపు

- సకల దేవతలకు ఆహ్వానం
- ఆగమోక్తంగా ధ్వజారోహణం
- నృసింహుని బ్రహ్మోత్సవాలకు పోటెత్తిన జనం

రాపూరు: ప్రముఖ పుణ్యక్షేత్రమైన పెంచలకోనలోని పెనుశిల లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం ధ్వజారోహణ కార్యక్రమాన్ని ఆగమోక్తంగా చేపట్టారు. సకల దేవతలకు ఆహ్వానం పలుకుతూ ధ్వజపటాన్ని ఎగురవేశారు. ఉదయం దేవదేవేరులకు ఉభయదాతలు పట్టువస్త్రాలు సమర్పించారు. తర్వాత శ్రీవారు, ఆదిలక్ష్మి అమ్మవారు, ఆంజనేయ స్వామికి ప్రత్యేక పూలంగి సేవ జరిపించారు. అనంతరం దేవదేవేరులను, గరుత్మంతుడి చిత్రపటాన్ని తిరుచ్చి పీఠంపై కొలువుదీర్చి ఆలయంలో గిరిప్రదక్షిణ నిర్వహించారు. అక్కడి నుంచి ధ్వజస్తంభం వద్దకు చేరుకుని అర్చకులు గరుత్మంతుడి చిత్రపటానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ధ్వజస్తంభానికి అభిషేకాలు నిర్వహించి ధ్వజపటాన్ని ధ్వజ స్తంభంపైకి ఎగురవేశారు. కార్యక్రమంలో డీసీ సాగర్ బాబు, చెంగాళమ్మ దేవస్థానం ఏసీ వెంకటేశ్వర్లు, ఉప ప్రధానార్చకులు పెంచలయ్యస్వామి, సీతారామయ్యస్వామి, టీటీడీ పాంచరాత్ర ఆగమపండితులు రామానుజాచార్యులు పాల్గొన్నారు.

కొడిముద్దల కోసం పోటీ

బ్రహ్మోత్సవాల్లో జరిగే ధ్వజారోహణానికి ఎంతో విశిష్టత ఉంది. గరుత్మంతుడికి పూజలు, అభిషేకాలకు ఉపయోగించిన ప్రసాదాలను స్వీకరిస్తే సంతాన ప్రాప్తి కలుగుతుందని భక్తుల విశ్వాసం. దీంతో ఈ ప్రసాదం కోసం మహిళలు పెద్ద సంఖ్యలో పోటీ పడ్డారు. స్నపన తిరుమంజన కార్యక్రమం నేత్రపర్వంగా సాగింది. దేవదేవేరులను తిరుచ్చిలో కొలువుదీర్చి 1008 సహస్ర దీపాలంకరణ మండపంలో ఉంచి ఊంజల్‌సేవ నిర్వహించారు.

- రాత్రి పెనుశిల లక్ష్మీనరసింహస్వామి, ఆదిలక్ష్మీదేవి, చెంచులక్ష్మీదేవేరులతో కలిసి శేష వాహనంపై ఊరేగారు. భక్తులు కర్పూర నీరాజనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.
- మంగళవారం ఉదయం హంస వాహనసేవ, రాత్రి 10 గంటలకు బంగారు హనుమంత వాహనంపై శ్రీవారి క్షేత్రోత్సవం నిర్వహించనున్నట్లు అధికారులు తెలిపారు.


స్నపన తిరుమంజనం అనంతరం విశేషాలంకరణలో స్వామి, అమ్మవార్లు


ధ్వజ స్తంభం వద్ద పూజలు


స్వామి, అమ్మవార్లకు ఊంజల్‌సేవ నిర్వహిస్తున్న వేదపండితులు


కొడిముద్దలను అందిస్తూ..


శ్రీవారి ఆలయంలో హోమం నిర్వహిస్తున్న వేదపండితులు

కరిమాణిక్యస్వామి ఉత్సవాలు ప్రారంభం

- ఘనంగా అంకురార్పణ
- నేడు ధ్వజారోహణం


అంకురార్పణ పూజలు చేస్తున్న వేదపండితులు

నాయుడుపేట టౌన్: పట్టణ పరిధిలోని తుమ్మూరులో వెలసిన శ్రీదేవి, భూదేవి సమేత కరిమాణిక్యస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలను సోమవారం రాత్రి అంకురార్పణతో ప్రారంభమయ్యాయి. టీటీడీకి చెందిన వేద పండితులు ఆలయం వద్ద వివిధ పూజలు చేశారు. రాత్రి స్వామికి ఏకాంత సేవ చేపట్టారు. కార్యక్రమాల్లో టీటీడీ డిప్యూటీ ఈఓ దేవేంద్రబాబు, ఏఈఓ కె.సుబ్బరాజు, సూపరింటెండెంట్ డి.శ్రీనివాసులు, ఆలయ ఇన్‌స్పెక్టర్ హరిరెడ్డి, సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న కార్డన్ సెర్చ్

- 40 మోటార్‌బైక్‌లు, ఒక ఆటో స్వాధీనం

నెల్లూరు(క్రైమ్): నేర నియంత్రణ, శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా పోలీసు అధికారులు నగర, పట్టణ, గ్రామ శివార్లు, ఎక్స్‌టెన్షన్ ఏరియాల్లో కార్డన్ సెర్చ్‌ను కొనసాగిస్తున్నారు. సోమవారం వేదాయపాళెం పోలీసుస్టేషన్ పరిధిలోని వైఎస్ఆర్ నగర్, కావలి రెండో పట్టణం, ఉదయగిరి, వెంకటాచలసత్రం, ఆత్మకూరు, సైదాపురం, బుచ్చి, తోటపల్లిగూడూరు, ముత్తుకూరు పోలీసుస్టేషన్ల పరిధిలో సెర్చ్ జరిగింది. తెల్లవారుజాము నుంచే స్థానిక డీఎస్పీలు, సీఐలు, ఎస్సైలు, స్పెషల్ పార్టీ సిబ్బందితో కలిసి ఆయా ప్రాంతాల్లోని ప్రతి ఇంట్లో తనిఖీలు చేశారు. రికార్డుల్లేని 40 మోటార్‌బైక్‌లు, ఒక ఆటోను స్వాధీనం చేసుకుని ఆయా పోలీసుస్టేషన్లకు తరలించారు. ఈ సందర్భంగా నగర డీఎస్పీ డి.శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ నేర నియంత్రణకు కార్డన్ సెర్చ్ దోహదపడుతుందన్నారు. పరారీలో ఉన్న నేరస్తులను గుర్తించి అదుపులోకి తీసుకోవడం, అనుమానస్పద వ్యక్తుల కదలికలపై నిఘా, రికార్డులు సక్రమంగా లేని వాహనాల స్వాధీనం, అక్రమ మద్యం, ఆయుధాలు, పేలుడు పదార్థాలు, మాదకద్రవ్యాలను గుర్తించి స్వాధీనం చేసుకోవడమే లక్ష్యంగా సెర్చ్ చేస్తున్నట్లు తెలిపారు.


పోలీసులు స్వాధీనం చేసుకున్న వాహనాలు


వాహనపత్రాలు పరిశీలిస్తున్న డీఎస్పీ శ్రీనివాసరెడ్డి, ఇన్‌స్పెక్టర్ నారాయణ

లారీని ఢీకొన్న మోటార్‌బైక్

- ఒకరికి తీవ్ర గాయాలు

సంగం: ఆగి ఉన్న లారీని వెనుక నుంచి మోటార్ బైక్ ఢీకొని ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడిన ఘటన మండలంలోని పెరమన వద్ద నెల్లూరు – ముంబై జాతీయ రహదారిపై సోమవారం జరిగింది. స్థానికుల కథనం మేరకు.. కొండాపురం మండలం కలవారిపల్లి గ్రామానికి చెందిన కర్నాటి ఓంకార్ అనే వ్యక్తి ఆత్మకూరు మున్సిపల్ కార్యాలయంలో ప్రభుత్వ ఉద్యోగిగా పనిచేస్తున్నాడు. సోమవారం ఉదయం పని నిమిత్తం మోటార్‌బైక్‌పై నెల్లూరుకు బయలుదేరాడు. లారీ టైరు పంక్చర్ కావడంతో పెరమన వద్ద ఆగి ఉంది. ఓంకార్ వెనుక నుంచి లారీని ఢీకొన్నాడు. దీంతో తలకు తీవ్ర గాయమైంది. స్థానికులు గుర్తించి అతడిని చికిత్స నిమిత్తం నెల్లూరుకు తరలించారు. సమాచారం అందుకున్న ఎస్సై నాగార్జునరెడ్డి ఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


ఘటనా స్థలంలో లారీ, బైక్

శిక్షణకు హాజరుకావాలి

- డీఈఓ పీవీజీ రామారావు

ఉలవపాడు: సీబీఎస్ఈ బోధనా శిక్షణ తరగతులకు ఉపాధ్యాయులు హాజరుకావాలని, లేకపోతే షోకాజ్ నోటీసులివ్వనున్నట్లు డీఈఓ పీవీజీ రామారావు తెలిపారు. మండలంలోని వీరేపల్లి మోడల్ స్కూల్లో జరుగుతున్న రెండో విడత శిక్షణను సోమవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులకు మెరుగైన విద్య అందించేందుకు శిక్షణ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వీటికి ఉపాధ్యాయులందరూ హాజరుకావాలన్నారు. అనంతరం ఉలవపాడు ప్రభుత్వ ఉన్నత పాఠశాలను పరిశీలించారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఈఓ ప్రసాదరావు, సమగ్ర శిక్ష అభియాన్ అధికారులు శాంతి, శ్రీదీప్, మోడల్ స్కూల్ ప్రిన్సిపల్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.


శిక్షణను పరిశీలిస్తున్న డీఈఓ రామారావు

నిమ్మ ధరలు

(కిలో)

పెద్దవి : రూ.75
సన్నవి : రూ.35
పండ్లు : రూ.25



భక్తుల కొంగు బంగారం పోలేరమ్మ

- 26 నుంచి జాతర
- ఏర్పాట్లు చేస్తున్న అధికారులు

నాయుడుపేట టౌన్: కోరిన కోరికలు తీర్చే కల్పవల్లిగా పేరున్న నాయుడుపేట గ్రామదేవత పోలేరమ్మ 49వ జాతర మహోత్సవాలు ఈనెల 26వ తేదీన ప్రారంభం కానున్నాయి. మూడురోజులపాటు అత్యంత వైభవంగా నిర్వహించేందుకు దేవదాయ శాఖ అధికారులు, స్థానిక పెద్దలు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ జాతరను 90 ఏళ్ల క్రితం వెంకటగిరి రాజాల పాలనలో అప్పటి విన్నమాల మజరాలో హవల్దార్‌గా పనిచేసిన నల్లబోతుల వెంకయ్య మొదలు పెట్టినట్టు పెద్దలు చెబుతున్నారు.

చిన్న గ్రామంగా ఉన్న నాయుడుపేటలో అనేకమందికి అమ్మతల్లి పోసి అనారోగ్యానికి గురయ్యారు. గ్రామస్తులు అంకాళమ్మ ఆలయం వద్ద పూజలు చేయడంతో కొంతమందికి అమ్మవారు పూనింది. గ్రామంలో పోలేరమ్మను ప్రతిష్ఠించి పూజలు చేస్తే మంచి జరుగుతుందని చెప్పింది. దీంతో పోలేరమ్మ మట్టి ప్రతిమను చేసి జాతర నిర్వహించారు. వ్యాధులు పోయి అందరూ సంతోషంగా జీవించడం మొదలు పెట్టారు. అప్పటి నుంచి ప్రతి ఏటా జాతర చేస్తున్నారు. అప్పట్లో విన్నమాల మజారాగా పిలవబడే నాయుడుపేట, ఎల్ఏ సాగరం, విన్నమాలకు చెందిన పెద కాపులతోపాటు అన్ని వర్గాలకు చెందిన వారు కలిసి జాతరను నిర్వహించేవారు. తదనంతర కాలంలో నాయుడుపేటకు చెందిన నల్లబోతుల నాగరత్నం చొరవతో కొండా రాజగోపాల్‌శెట్టి కుటుంబీకులు, డాక్టర్ మోహన్ కృష్ణ తదితరులు గడియారం సెంటర్ వద్ద గ్రామదేవత పోలేరమ్మ, పోతురాజు ప్రతిమలను ప్రతిష్ఠించి జాతర నిర్వహించేలా చర్యలు తీసుకున్నారు. నాటి నుంచి అక్కడ జాతర నిర్వహిస్తున్నారు. గతంలో జాతర కమిటీలో వివాదాలు చెలరేగి పోలేరమ్మ ఆలయ నిర్వహణ బాధ్యతలను ఎనిమిదేళ్ల క్రితం దేవదాయ శాఖకు అప్పగించారు. నాటి నుంచి జాతరను పూర్వీకులు ఎలా నిర్వహించేవారో అలాగే అధికారులు జరుపుతున్నారు. పోలేరమ్మ జాతరకు అప్పట్లో వెంకటగిరి రాజాలు అందించిన పాదుకలు, హస్తాలతోపాటు దాతలు సమర్పించే ఆభరణాలతో అమ్మవారికి అలంకరణ చేయడం ఆనవాయతీగా వస్తోంది.


పోలేరమ్మ, పోతురాజు


జాతరలో ప్రత్యేకాలంకరణలో పోలేరమ్మ (ఫైల్)

కండలేరులో 6.726 టీఎంసీల నీరు

రాపూరు: కండలేరు జలాశయంలో సోమవారం నాటికి 6.726 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. హెడ్ రెగ్యులేటర్ నుంచి సత్యసాయిగంగకు 15 క్యూసెక్కులు, పిన్నేరువాగుకు 5, లోలెవల్ కాలువకు 30 క్యూసెక్కుల వంతున నీటిని విడుదల చేస్తున్నట్లు పేర్కొన్నారు.

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు

బ్రాయిలర్ (లైవ్)	: 172
లేయర్ (లైవ్)	: 110
బ్రాయిలర్ చికెన్	: 300
బ్రాయిలర్ స్కిన్‌లెస్	: 330
లేయర్ చికెన్	: 187